సాక్షి
సంగారెడ్డి
ఆదివారం। 8। అక్టోబర్। 2023



గొర్రెల పంపిణీ ఎక్కడ?

సిద్దిపేట జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీ కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. వివరాలు 8లో ▸



గ్రంథాలయం ఉన్నా..

ఝరాసంగంలో పాఠకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన గ్రంథాలయం నిరుపయోగంగా మారింది. వివరాలు 9లో ▸

నేడు విద్యుత్ కోత ప్రాంతాలివే

సంగారెడ్డి: టౌన్–2 సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని ఏఈ సంతోష్ శనివారం తెలిపారు. మంజీరానగర్, వీరభద్రనగర్, రైతుబజార్, ప్రశాంత్‌నగర్, ఎఫ్‌ఆర్‌ఎస్, రాజంపేట తదితర కాలనీల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

న్యూస్‌రీల్

ఎమ్మెల్యేకు పరామర్శ



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న ప్రదేశ్ సీఎం సరోజ్ కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని నేపాల్ దేశంలోని మదేశ్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సరోజ్ కుమార్ యాదవ్ పరామర్శించారు. ఇటీవల ఆయన కుమారుడు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి అకాల మరణం చెందడంతో శనివారం ఇంటికి వచ్చి పలకరించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి, రెండో కుమారుడు విక్రంరెడ్డి, కుటుంబసభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్



మాట్లాడుతున్న చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్(టీఎస్‌హెచ్‌డీసీ) చైర్మన్ చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సూర్య నర్సింగ్ హోమ్‌లో ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్, లయన్స్ క్లబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్, గుండె వ్యాధుల నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంగారెడ్డి డీఎస్పీ రమేష్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్ పిల్లోడి విశ్వనాథం, వైద్యులు రాజ్‌కుమార్, ప్రజ్ఞ, సింధు, హారిక, కిషోర్‌కుమార్, మంజునాథ్, మాధురి, జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సిబ్బంది కొరత



రోగులతో మాట్లాడుతున్న ప్రకాష్ రాథోడ్

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో వైద్యసేవలను మెరుగుపర్చాలని బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రాథోడ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిని సంఘం బాధ్యులతో కలిసి శనివారం సందర్శించారు. రోగులు, సిబ్బందిని అడిగి అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్న ఈ 100 పడకల ఆస్పత్రిలోనే వైద్యులు, మందుల కొరత, సదుపాయాలు తగిన విధంగా లేవన్నారు. గర్భిణులు, ఇతర రోగులకు సరియైన పరీక్షలు, ల్యాబ్ సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తగినంత సిబ్బందిని నియమించుకోవాలని, సదుపాయాలు, మందులను సమకూర్చుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్, ఉపాధ్యక్షుడు సురేష్, ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్ రాథోడ్, వినోద్‌నాయక్, రాజు, రఘు ఉన్నారు.

ప్రతి ఇంటికీ తాగు నీరు



మిషన్ భగీరథ నల్లాను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ రంగారెడ్డి

పటాన్‌చెరు: ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగు నీరు అందిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల పాండు రంగారెడ్డి అన్నారు. శనివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు మారుతి హిల్స్ కాలనీలో మిషన్ భగీరథ ద్వారా నల్లాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ రోజురోజుకూ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని తెలిపారు. అందరికీ రక్షిత మంచినీరు అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బిజిలి రాజు, హెచ్‌ఎండబ్ల్యూఎస్ జీఎం నారాయణ, బీజీఎం చంద్రశేఖర్, ఏఈ అమీరుద్దీన్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శేఖర్, చౌటకూరి మహిపాల్, చౌటకూరి సురేందర్ రెడ్డి, ఆంజనేయులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.





బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎమ్మెల్యే మాణిక్‌రావు, హాజరైన ప్రజలు

రెండేళ్లలో కాళేశ్వరం జలాలు

జహీరాబాద్‌లో ప్రతి ఎకరాకు సాగు నీరు

- వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే
- ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు
- నియోజకవర్గానికి మరో 2 వేల గృహలక్ష్మి ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటన

జహీరాబాద్: వచ్చే రెండేళ్లలో కాళేశ్వరం జలాలను సంగమేశ్వర ఎత్తిపోతల పథకం కింద జహీరాబాద్‌కు తీసుకుని వచ్చి ప్రతి ఎకరా పొలం తడిసేలా పనులు జరుగుతున్నాయని ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు వెల్లడించారు. శనివారం రాత్రి ఆయా పథకాలకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ముందుగా రూ.35 కోట్లతో నిర్మించిన 660 డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించి, లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం పట్టణంలోని బాగారెడ్డి స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేయనున్న ఎమ్మెల్యే కె.మాణిక్‌రావునే గెలిపించాలని, లేనట్లయితే ఆగమవుతారని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అన్నారు. నియోజకవర్గానికి మూడు వేల గృహలక్ష్మి ఇళ్లను మంజూరు చేశామని స్పష్టం చేశారు. ఇవి చాలవని కోరినందున మరో రెండు వేల గృహాలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గానికి రూ.175 కోట్ల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను అమలవుతున్నాయని అన్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు రూ.204 కోట్లు బ్యాంకు లింకేజీ కింద అందజేశామని వెల్లడించారు. 50 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వం తొమ్మిదేళ్లలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామన్నారు. ప్రతి ఇంటికీ ఏదొక పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. కాంగ్రెస్ నేతలు చెప్పే మాటలు నమ్మకుండా బీఆర్‌ఎస్ అభ్యర్థినే గెలిపించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయా కుల సంఘాలకు భవనాల నిర్మాణం కోసం స్థలాల పట్టాలను అందజేశారు. ఐడీఎస్‌ఎంటీ ప్లాట్ల సమస్యను త్వరలోనే పరిష్కరించి రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత నాడు–నేడు ప్రగతి నివేదిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ శరత్, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై.నరోత్తం, ఐడీసీ చైర్మన్ ఎండీ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్, డీఆర్‌యూసీసీ మెంబర్ షేక్ ఫరీద్, బీఎస్‌ఎన్‌ఎల్ సభ్యుడు శంకర్‌నాయక్, ఆయా మండలాల ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



నాడు-నేడు ప్రగతి నివేదిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు

మాజీ ఎమ్మెల్యే బాగన్న విగ్రహావిష్కరణ

పట్టణంలోని బైపాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్యే సి.బాగన్న విగ్రహాన్ని మంత్రి హరీశ్‌రావు ఆవిష్కరించారు. పేదల అభ్యున్నతి కోసం ఆయన ఎంతో కష్టపడ్డారని గుర్తుచేశారు. రాజకీయాల్లో ఉన్నన్ని రోజులు ప్రజల కోసమే పాటు పడ్డారన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బాగన్న కుటుంబ సభ్యులు, ముదిరాజ్‌సంఘం నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రారంభం

కోహీర్(జహీరాబాద్): మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల బాలుర, బాలికల డిగ్రీ కళాశాలను ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు ప్రారంభించారు. మండలంలోని కవేలి క్రాస్ రోడ్డు వద్ద టూరిజం భవనంలో కొత్తగా మంజూరైంది. కాగా శనివారం రాత్రి జహీరాబాద్ నుంచి సంగారెడ్డికి వెళుతూ మార్గమధ్యలో ఆగి ప్రారంభించారు.

అన్నికులాలకు ఆత్మగౌరవ భవనాలు

సంగారెడ్డి: బీఆర్‌ఎస్ సంగారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను గెలిపించాలని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం రాత్రి పట్టణంలో పద్మశాలి, గౌడ, ముదిరాజ్ కులస్తులకు ఆత్మగౌరవ భవనాల స్థలాల సరిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించాలన్న గొప్ప మనస్సు కేసీఆర్‌దేనని చెప్పారు. రాబోయే రోజుల్లో సంగారెడ్డిని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అన్ని వర్గాలను గౌరవించే గొప్ప సంస్కృతి బీఆర్‌ఎస్‌దేనని అన్నారు. కాంగ్రెస్ హయాంలో ముదిరాజులకు చేసిందేమీ విమర్శించారు. వారిని చట్టసభలకు పంపింది తమ పార్టీయేనని తెలిపారు. కురుమలకు, గౌడ కులస్తులకు న్యాయం చేసింది కూడా తామేనని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ, కలెక్టర్ శరత్, ఎర్రోళ్ల శ్రీనివాస్, మఠం భిక్షపతి, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్కనగరాజ్‌గౌడ్, విజేందర్ రెడ్డి, నరహరిరెడ్డి, బుచ్చిరెడ్డి, వివిధ శాఖల అధికారులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లోకి చేరారు. కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నాలుగులేన్ల రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఝరాసంగం(జహీరాబాద్): మండల కేంద్రమైన ఝరాసంగంలో రూ.500 కోట్ల నిధులతో నిర్మించనున్న నాలుగులేన్ల రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. అనంతరం మండలంలోని బిడకన్నెలో 96 మంది రైతులకు 144 ఎకరాలకు సంబంధించిన లావాణి పట్టా పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందని మంత్రి అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసిన బోర్లను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. రుణమాఫీ డబ్బులు రాలేదని రైతులు అడుగగా రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు జగదీశ్వర్, రజనీప్రియ సంతోష్‌పాటిల్ పాల్గొన్నారు.



ఝరాసంగం : నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న హరీశ్‌రావు

ఒకే గొడుగు కింద రక్షణ సేవలు

- మహిళా భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత: డీజీపీ
- సంగారెడ్డిలో చైల్డ్ ఫ్రెండ్లీ వింగ్ ప్రారంభం



భరోసా సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీజీపీ అంజనీకుమార్

సంగారెడ్డి: రాష్ట్రంలో ఒకే గొడుగు కింద అన్ని రకాల రక్షణ సేవలు తీసుకొచ్చామని డీజీపీ అంజనీకుమార్ తెలిపారు. శనివారం సంగారెడ్డిలో భరోసా కేంద్రం, చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్ వింగ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో అన్ని పోలీస్ స్టేషన్లలో చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. భరోసా సెంటర్ ద్వారా బాధితులను అక్కున చేర్చుకొని తక్షణ పరిష్కారం చూపుతామన్నారు. ఈ సెంటర్ సేవలను సుప్రీంకోర్టు సైతం అభినందించిందని, ఇలాంటి కేంద్రాలు దేశవ్యాప్తంగా అమలు చేయాలని సూచించడం రాష్ట్రానికి గర్వకారణమని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసు శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని, ప్రస్తుతం అవి దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. అడిషనల్ డీజీపీ శిఖాగోయల్ మాట్లాడుతూ మహిళల రక్షణకు పెద్దపీట వేశామని, రాష్ట్రవ్యాప్తంగా షీ టీమ్స్ బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. భరోసా కేంద్రాన్ని ఏర్పాటుకు సహకరించిన అరబిందో కంపెనీ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ శరత్, ఏఎస్పీ అశోక్, ఎస్పీ రమణకుమార్, సంగారెడ్డి డీఎస్పీ రమేశ్‌కుమార్, సీఐలు శ్రీధర్‌రెడ్డి, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

● జాబ్‌మేళాకు అనూహ్య స్పందన



జహీరాబాద్‌లో నిర్వహించిన జాబ్‌మేళాకు అనూహ్య స్పందన వచ్చింది. బీబీ పాటిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం డెక్కన్ బ్లాస్టర్ డైరెక్టర్ మన్నాన్‌ఖాన్ సహకారంతో ఈ మేళా జరిగింది. 71 కంపెనీలు కాగా 1200 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఇంటర్వ్యూలో 250 మందికి పైగా ఆయా కంపెనీ ప్రతినిధులు హాజరై ఎంపికలు చేపట్టారు. అయితే హైదరాబాద్‌లోని ప్రముఖ కంపెనీ ప్రతినిధులు ఇక్కడ జాబ్‌మేళా నిర్వహించడం ఇక్కడి ప్రాంత యువతకు ఉపయోగపడిందని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు తెలిపారు. ఇందు కోసం డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్ ఫరీద్ కృషి చేశారని పేర్కొన్నారు. - జహీరాబాద్

మా పాలనలోనే అభివృద్ధి

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మనూరు(నారాయణఖేడ్): మేము అధికారంలోకి వచ్చాక ఖేడ్ నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నాం అని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. మనూరు ఉమ్మడి మండలంలో విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు భూమిపూజ, ప్రారంభోత్సవాలను శనివారం నిర్వహించారు. మనూరులోని ఐకేపీ మహిళా సభ్యులను రిమోట్ ఫ్యాన్‌లు, మహిళలకు బతుకమ్మ చీరలను అందజేశారు. నాగల్‌గిద్ద మండలం మోర్గిలో మోడల్ కళాశాల ఆవరణలో రూ.1.28కోట్లతో నిర్మించిన బాలికల హాస్టల్ భవనాన్ని, అదే గ్రామంలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు అందించారు. కేశ్వార్ పంచాయతీ పరిధిలో నూతన చెరువు నిర్మాణానికి రూ.6.27 కోట్లతో చెరువు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు కొంగరి జయశ్రీమోహన్‌రెడ్డి, రాథోడ్ మెతిబాయి, జెడ్పీటీసీ రాజురాథోడ్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు పండరియాదవ్, బోరంచ రాములు, నందుపాటిల్, ప్రహల్లాద్, జగప్ప, మారుతి, రాజురెడ్డి సర్పంచ్‌లు అంజిరెడ్డి, రాజు పాల్గొన్నారు.



కేశ్వార్‌లో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

అన్ని స్కూళ్లల్లో అల్పాహారం

- పండగ తర్వాత అందుతోంది
- జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

వట్‌పల్లి(అందోల్): పాఠశాల విద్యార్థుల చదువు, ఆరోగ్యంపై ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం జోగిపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో సీఎం అల్పాహార పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి వడ్డించి నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యమైన అభ్యాసంతోపాటు, పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం దీనిని ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న 1.23 లక్షల మందికి పథకం ద్వారా పౌష్టిక అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. దసరా పండగా తర్వాత జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పహారం అందుతోందన్నారు. దీనిపై ఎస్‌ఎంఎస్ కమిటీలు సమావేశాలను నిర్వహించి అవగాహనను కల్పించాలన్నారు. విద్యార్థులు కూడా చిన్న వయస్సు నుంచే ఆరోగ్యంతో ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం నాణ్యమైన పోషక విలువలు కలిగిన అల్పాహారాన్ని అందిస్తోందన్నారు. ఈ విషయమై ఉపాధ్యాయులు సమయ పాలన తప్పనిసరిగా పాటించాలన్నారు.



విద్యార్థులకు అల్పాహారాన్ని వడ్డిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

పథకాలతోనే పేదల జీవితాల్లో వెలుగులు

- గత పాలకుల హయాంలో అక్రమాలు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

పటాన్‌చెరు: గత పాలకుల హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అవినీతికి చిరునామాగా నిలిస్తే.. ఈరోజు సీఎం కేసీఆర్ నాయకత్వంలో అమలవుతున్న పథకాలు పేదవాడి జీవితాల్లో వెలుగు నింపుతున్నదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని రుద్రారంలో రూ. 5.07 కోట్ల అంచనాతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు శుక్రవారం సాయంత్రం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా ప్రజల సమక్షంలో ప్రణాళికలు రూపొందిస్తూ పూర్తి పారదర్శకతతో పనులు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని వివిధ రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో సీఎం చేసిన అభివృద్ధికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం రుద్రారం గ్రామం నుంచి గీతం వర్సిటీ వరకు 2 కోట్ల 25 లక్షల రూపాయలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులనూ ప్రారంభించారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఎంపీపీ సుష్మా శ్రీ , జెడ్పీటీసీ సుప్రజా, సర్పంచ్ సుధీర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాండు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

వాహనాల అందజేత

దళితుల ఆర్థిక అభ్యున్నతి కోసం దేశంలోనే మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత బంధును ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో పటాన్‌చెరు, రామచంద్రాపురం డివిజన్‌ల పరిధిలోని ఇద్దరు లబ్ధిదారులకు ఈ పథకం ద్వారా మంజూరైన వాహనాలను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, పరమేశ్ యాదవ్, గోవింద్, యాదయ్య, కుమార్‌గౌడ్, కృష్ణకాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్కరకు రాని వైద్యం


- కార్మికులకు దూరమైన ఈఎస్‌ఐ సేవలు
- పదేళ్ల క్రితం రంగారెడ్డి జిల్లా పరిధిలో ఏర్పాటు
- అప్పటి నుంచి ఉద్యోగులకు తప్పని తిప్పలు
- బొల్లారంలో ఏర్పాటుకు డిమాండ్

జిన్నారం(పటాన్‌చెరు): ఈఎస్‌ఐ సేవలు కార్మికులకు దూరమయ్యాయి. దీంతో ఏళ్ల కాలం నుంచి కార్మికులు ప్రైవేటు వైద్యం వైపు చూస్తున్నారు. పారిశ్రామికవాడలో కాకుండా పది కిలోమీటర్ల దూరంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఉండటం సమస్యగా మారింది. జిన్నారం మండలంలోని గడ్డపోతారం, ఖాజీపల్లి, బొల్లారం పారిశ్రామిక వాడల్లో సుమారు 250 పరిశ్రమలు ఉన్నాయి. లక్ష వరకు ఆయా రాష్ట్రాలకు చెందిన కార్మికులు విధులు నిర్వహిస్తుంటారు. 70 వేల మందికి ఈఎస్‌ఐ కార్డులున్నాయి. గతంలో ఈఎస్‌ఐ(ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్) డిస్పెన్సరీ బొల్లారం పారిశ్రామిక వాడలో ఉండేది. పదేళ్ల క్రితం దీనిని సుమారు పది కిలోమీటర్ల దూరంలోని రంగారెడ్డి జిల్లా పరిధిలో గల బాచుపల్లికి తరలించారు. అందుకు గల కారణాలను కూడా అధికారులు వెల్లడించలేదు. అప్పటి నుంచి కార్మికులు అక్కడికి వెళ్లాల్సి వస్తోంది. కష్టపడి పరిశ్రమల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు వైద్యసేవల కోసం ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారికి ఖర్చులు భారంగా మారుతున్నాయి. బాచుపల్లి నుంచి బొల్లారానికి దానిని మార్చాలని కార్మిక సంఘాల నాయకులు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఇదే అదునుగా భావించిన ప్రైవేటు వైద్యులు వారిని దోచుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈఎస్‌ఐ ఆస్పత్రిని బొల్లారానికి మార్చాలని కార్మికులు కోరుతున్నారు.



బాచుపల్లిలో ఈఎస్‌ఐ డిస్పెన్సరీ

అండగా ఉంటున్నాం



కార్మికులకు ఈఎస్‌ఐ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ విషయమై అధికారులపై ఒత్తిడి తెస్తున్నాం. అందరూ ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలి. ఈఎస్‌ఐ వైద్య సేవలను అందించేందుకు మా వంతు కృషి చేస్తున్నాం.

– వరప్రసాద్‌రెడ్డి, కార్మిక సంఘం నేత

క్లుప్తంగా

లోన్ పేరుతో

రూ.2.35 లక్షల స్వాహా

లోన్ పేరుతో రూ.2.35 లక్షల స్వాహా

పటాన్‌చెరు టౌన్: లోన్ ఇప్పిస్తామని ఆశ చూపి ఒకరి నుంచి రూ.2.35 లక్షలు దోచుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మండలం పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి గత ఏడాది మే 31న కోటి రూపాయల లోన్ ఇప్పిస్తామని ఫోన్‌కాల్ వచ్చింది. దీంతో బాధితుడు అపరిచిత వ్యక్తులు చెప్పిన దానిని నమ్మి రూ.2.35 లక్షల చెల్లించాడు. లోన్ ప్రాసెస్‌లో ఉందని చెప్పి నమ్మిస్తూ వచ్చారు. చివరికి బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురిపై న్యూసెన్స్ కేసు

నారాయణఖేడ్: మండల పరిధిలోని జూకల్ గ్రామంలో ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి శుక్రవారం రాత్రి పలు పనులకు ప్రారంభోత్సవం చేస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన వినయ్, నరేష్, మల్లప్ప, వీరన్న మద్యం మత్తులో న్యూసెన్స్ సృష్టించారని ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి శనివారం తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

రాష్ట్రస్థాయికి తిగుల్ విద్యార్థులు



విద్యార్థులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికై నట్టు పాఠశాల పీఈటీ రవికుమార్ తెలిపారు. ఇటీవల ఉమ్మడి జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో అండర్ 17 విభాగంలో పావని, స్రవంతి ప్రతిభ చాటారు. అండర్14 విభాగంలో ప్రణతి, ప్రవల్లిక, అనిల్ ప్రతిభ చాటారు. వారంతా వనపర్తి, కొమురంభీమ్, అసిఫాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారని చెప్పారు. సర్పంచ్ భానుప్రకాష్‌రావు, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య విద్యార్థులకు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనసూయ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ ఎక్కడ?

- నాలుగు నెలల్లో 1,160 మందికే
- డీడీలు చెల్లించినా.. పంపిణీలేదు
- ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు



గొర్రెల మందను అడ్డుగా పెట్టి ఎంపీకి నిరసన తెలుపుతున్న గొల్ల కురుమలు (ఫైల్)

సాక్షి, సిద్దిపేట: జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీ కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జూన్ 9న రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాలుగు నెలల్లో 1,160 మంది లబ్ధిదారులకు మాత్రమే గొర్రెలు పంపిణీ చేశారు. ఇదే విధంగా కొనసాగితే మరో ఆరు నెలలు గడిచినా మొత్తం యూనిట్‌ల పంపిణీ జరగదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండో విడతకు 16 వేల యూనిట్‌లు

జిల్లాలో మొత్తం 412 ప్రాథమిక గొర్రెల పెంపక సహకార సంఘాలు ఉండగా 32,452 మంది సభ్యులు ఉన్నారు. 2017లో మొదటి విడతలో 15,720 పంపిణీచేసి, రెండో విడతలో 16,732 మందికి పంపిణీ చేసేందుకు ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు. ప్రభుత్వం గొల్ల కురుమలకు 75 శాతం సబ్సిడీ కింద ఒక యూనిట్‌కు 20 గొర్రెలు, ఒక పొట్టేలును అందిస్తారు. 2017లో ఒక్కో యూనిట్‌కు రూ.1.25 లక్షలు నిర్ణయించగా అందులో లబ్ధిదారుడు రూ.31,250 డీడీ ద్వారా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉండేది. ప్రభుత్వం ఇచ్చే రూ.1.25 లక్షలతో 21 గొర్రెలు రాకపోవడంతో మరో రూ.50 వేలు పెంచుతూ యూనిట్ ధరను రూ. 1.75లక్షలుగా నిర్ధారించారు. ఈ క్రమంలో లబ్ధిదారులు రూ.43,750లు డీడీ రూపంలో చెల్లించాలి. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సంక్షేమ దినోత్సవం జూన్ 9 నుంచి రెండో విడత పంపిణీకి శ్రీకారం చుట్టారు.

6,563 మంది డీడీలు అందజేత

గొర్రెలను కర్నూల్, అనంతపురం, గుంటూరు ప్రాంతంలోనే కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిబంధన విధించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 6,563 మంది లబ్ధిదారులు గొర్రెల కోసం డీడీలను అందించారు. నెలలు గడుస్తున్నా గొర్రెల పంపిణీ చేయపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వివిధ గ్రామాల్లో డీడీలు చెల్లించినవారు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కోడ్ వస్తే నిలిపివేస్తారేమో అని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా గొర్రెలను పంపిణీ చేయాలని కోరుతున్నారు.

5 నెలలుగా ఎదురుచూస్తున్నాం..



గొర్రెల కోసం డీడీలు తీసి 5 నెలలు కావస్తోంది. అధికారులను అడిగితే రేపు.. మాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. రూ 43,750 కట్టి డీడీ తీసి మా ఊరు డాక్టర్‌కు ఇచ్చాం. గొర్రెలు ఎప్పుడిస్తారో ఎవరూ సరిగ్గా చెప్పడం లేదు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే మా పరిస్థితి ఏమిటో? ఇప్పటికైనా అధికారులు అత్వరగా పంపిణీ చేయాలి.

- పీరెల్ల రవి, అక్కన్నపేట

త్వరగా పంపిణీ చేయాలి..



2017 సంవత్సరంలో గొర్రెల పంపిణీ కోసం డ్రా తీస్తే రెండో విడతకు ఎంపికయ్యాను. గొర్రెల పంపిణీ కోసం మే నెలాఖరున రూ.43 వేలు డీడీ రూపంలో చెల్లించాను. ఇప్పటికి ఐదు నెలలు గడిచింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గొర్రెలను త్వరగా పంపిణీ చేయాలి.

- తుమ్మల గణేష్, దౌల్తాబాద్

ఆందోళన చెందొద్దు

రెండో విడతలో ఎంపికైన వారందరికీ తప్పకుండా గొర్రెలను అందజేస్తాం. దశల వారీగా లబ్ధి దారులను పంపిస్తున్నాం. ఇది నిరంతర ప్రక్రియ లబ్ధి దారులు ఎవరూ ఆందోళన చెందొద్దు.

- సత్యపాల్ రెడ్డి, ఇంచార్జి పశుసంవర్ధక శాఖ

డిమాండ్ల ప్లకార్డులతో..

- మహిళా ఆపరేటర్ల నిరసన



నిరసన తెలుపుతున్న కంప్యూటర్ ఆపరేటర్లు

మెదక్ కలెక్టరేట్: తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేపట్టిన ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు రోజుకో తీరుతో నిరసన తెలుపుతూ సమ్మె కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా శనివారం మహిళా ఆపరేటర్లు డిమాండ్ల ప్లకార్డులు పట్టుకొని అమ్మవారి విశ్వరూపంలో వినూత్నంగా చేశారు. అలాగే పురుష ఆపరేటర్లు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ప్రమాద, ఆరోగ్యబీమా కల్పించి, కారుణ్య నియామకాలు చేపట్టాలని, మహిళా ఆపరేటర్లకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని, మృతి చెందిన ఆపరేటర్ల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రశేఖర్ గౌడ్ , అధ్యక్షుడు సాయి కుమార్, ప్రధాన కార్యదర్శి చీల హరీష్ కుమార్, ముఖ్య సలహాదారు నామ లక్ష్మణ్, కోశాధికారి రామస్వామి, ఉపాధ్యక్షులు వెంకటేష్, మహిళా ఉపాధ్యక్షురాలు ప్రతిభా రెడ్డి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ బ్రెయిన్‌తో వ్యక్తిత్వ వికాసం



విద్యార్థులతో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

- వ్యక్తిత్వ వికాస నిపుణుడు నర్సింహారెడ్డి

పాపన్నపేట(మెదక్): సూపర్ బ్రెయిన్ వినియోగంతో విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందించవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణుడు నర్సింహారెడ్డి అన్నారు. పాపన్నపేట జూనియర్ కళాశాల విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జీవిత లక్ష్యాలను ఏర్పరుచుకుని ఆత్మన్యూనతా భావానికి గురికాకుండా ముందుకు పోవాలని సూచించారు. అందుకు యోగా మంచి మార్గమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నర్సింలు, భాగ్యలక్ష్మి, ప్రవీణ్ కుమార్, రమేష్, అరుణ, విజయ కుమార్, రాములు, మృదుల, రాజు, నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నిప్పంటించిన నిందితులకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణ, ఎస్ఐ గంగరాజు

దుబ్బాక రూరల్: మండలంలోని హబ్సిపూర్ గ్రామంలో బైండ్ల బాలవ్వ(52) గత నెల 7న హత్యకు గురైన విషయం అందరికి తెలిసిందే. హత్య చేసిన నిందితులు మద్దెల నవీన్ అతడి తల్లి చంద్రవ్వను గత నెల 19న రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 2న గ్రామానికి చెందిన కొంత మంది మహిళలు నిందితుల ఇంటి తాళం పగుల గొట్టి ఇంటిని ధ్వంసం చేయడమే కాకుండా ఇంటిలోని వస్తువులకు నిప్పంటించడంతో పూర్తిగా దగ్ధమయ్యాయి. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. వచ్చిన ఫిర్యాదు మేరకు పూర్తి స్థాయిలో విచారించి కొంత మందిని శనివారం రిమాండ్‌కు తరలించామని సీఐ కృష్ణ, ఎస్ఐ గంగరాజు తెలిపారు. కొంత మంది పరారీలో ఉన్నారని వారిని కూడా పట్టుకుంటామని చెప్పారు.

పథకాలపై అవగాహన

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికివద్ద గల డాక్టర్ డి.రామానాయుడు విజ్ఞానజ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యసంస్థ, వ్యవసాయ కళాశాలలో శిక్షణ పొందుతున్న ఏసీఏబీసీ (అగ్రి క్లీనిక్ అండ్ అగ్రీ బిజినెస్ సెంటర్) వ్యవసాయ విద్యార్థులకు ప్రభుత్వ పథకాలపై శనివారం కౌడిపల్లి వ్యవసాయ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఏఈఓ రాజశేఖర్‌గౌడ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రైతులకు వర్తించే పథకాలు, సబ్సిడీల గురించి వివరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి మహేష్, ఫీల్డ్ సూపర్‌వైజర్, వార్డెన్ జగదీష్ విద్యార్థులు పాల్గొన్నారు.

పొలాల్లోకి ఆటో.. విద్యార్థినులకు గాయాలు



చికిత్స పొందుతున్న విద్యార్థిని అక్షయ

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులను తీసుకొస్తున్న ఆటో రోడ్డు పక్కన పొలంలోకి దూసుకుపోవడంతో విద్యార్థులు గాయపడిన ఘటన శనివారం సాయత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధి తిమ్మాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థులు చిన్నగొట్టిముక్లలోని ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. వారు రోజూ ఒక ఆటోలో వెళ్తూ ఉంటారు. ఈ క్రమంలో శనివారం సాయత్రం పాఠశాల నుంచి విద్యార్థులతో వస్తున్న ఆ ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన పొలంలోకి దూసుకెళ్లింది. ముగ్గురు విద్యార్థినులు అక్షయ, పూజ, మధుశ్రీ గాయపడగా స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడం వల్ల ప్రమాదం జరిగిందని గ్రామస్తులు చెప్పారు. ఈ ప్రమాదం పై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ రవికాంత్‌రావ్ తెలిపారు.

లైవ్ యువర్ డ్రీమ్స్ వర్క్ షాప్

సిద్దిపేటఅర్బన్: మండలంలోని పొన్నాల శివారులోని ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో అశ్వ యూనిల్ఫ్ గ్రూపు, రోటరీ క్లబ్ ఆఫ్ కంటోన్మెంట్ ఆధ్వర్యంలో లైవ్ యువర్ డ్రీమ్స్‌పై శనివారం ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన అశ్వ యూనిల్ఫ్ గ్రూపు ఎండీ ఆచార్య వెంకట్ మాట్లాడుతూ.. కలలను కనండి వాటిని సాకారం చేసుకోండి, లక్ష్యాలు ఎంత స్పష్టంగా ఉంటే సాధించడంలో అంత విజయం పొందుతారన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు మాట్లాడుతూ లైవ్ యువర్ డ్రీమ్స్ గురించి తెలుసుకోవడం విద్యార్థులకు ఎంతో ఉపయోగం అన్నారు. కార్యక్రమంలో పీఆర్వో రఘు, హెచ్అండ్ఎస్ హెచ్‌వోడీ పాండురంగం, మహేష్, మంగమ్మ, రఘురాం, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పాలసీలు ఉపయోగం

పెద్దశంకరంపేట(మెదక్): పోస్టల్‌శాఖ అధ్వర్యంలో అందిస్తున్న జీవితబీమా పాలసీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి సబ్ డివిజన్ మెయిల్ ఓవర్సీస్ డి.శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 9 నుంచి 13 వరకు జాతీయ పోస్టల్ వారోత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో శనివారం తమ పాలసీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీపీఎంలు మాణయ్య, విజయ్‌కుమార్, గంగారం, రాఘవేందర్ పాల్గొన్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగు

- జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత



సమైక్య భవనాన్ని ప్రారంభిస్తున్న హేమలత, ప్రతాప్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): సీఎం కేసీఆర్ పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుపడిందని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతశేఖర్‌గౌడ్, రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపూర్ అగ్రహారంలో శనివారం వారు సుమారు రూ.కోటితో నిర్మించిన పంచాయతీ భవనం, మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంక్, మహిళా సమైక్యభవనం, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నాలుగు రోజులుగా గజ్వేల్ నియోజకవర్గంలో సుమారు రూజ1000 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. దళితబంధు గ్రామంలోని దళితులకు అందుతుందని, 10 వేల మందికి గృహలక్ష్మి మంజూరు పత్రాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పురం మహేష్, సర్పంచ్‌లు రేణుక, మహిపాల్‌రెడ్డి, నాగభూషణం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో 8 మంది మృతి

చీరతో ఉరివేసుకుని..



వినోద్(ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): చీరతో ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మాసాయిపేట మండలం కొప్పులపల్లి శివారులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాలగోని వినోద, శంకర్‌గౌడ్ దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు వినోద్(24) పని ఉందంటూ ఈ నెల 5న ఉదయం ఏడు గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్ళాడు. తిరిగి రాకపోవడంతో అతడి ఆచూకీ కోసం మూడురోజులుగా వెతికారు. శుక్రవారం ఉదయం వెల్దుర్తి మండలం హస్తాల్‌పూర్ శివారులోని ఓ చెట్టుకు చీరతో ఉరివేసుకుని ఉండడం గమనించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి, పెళ్ళి కావడం లేదనే మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని వినోద్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

భర్త వేధింపులు భరించలేక..

పటాన్‌చెరు టౌన్: భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకట్ రెడ్డి కథనం ప్రకారం... భగత్ గల్లికి చెందిన జాంగిర్ ఆటో డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడు తరచూ భార్య అమ్రీన్ సహేదాతో గొడవ పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రికూడా వారి మధ్య గొడవ జరిగ్గా అమ్రీన్ సహేదా(30) రాత్రి బెడ్ రూమ్ లోకి వెళ్లి చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. శనివారం మృతురాలి తండ్రి ఇస్మాయిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని..

పటాన్‌చెరు టౌన్: మందులకని వెళ్లి తిరిగి వస్తున్న తన స్కూటీని గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో మహిళ మృతిచెందిన ఘటన స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డిలో ఉంటున్న యాసిన్ ఖురేషి భార్య జియాబేగంకు అనారోగ్యంగా ఉండంతో టోలిచౌక్ లో ఉంటున్న కుమారుడు పత్తేమహ్మద్ వద్ద నుంచి మందులు తీసుకువద్దామని వారి కూతురు అజీమాబేగం(35) శుక్రవారం వెళ్లి మందులు తీసుకుని స్కూటీ పై వస్తోంది. ఈ క్రమంలో ఇస్నాపూర్ సమీపంలోకి రాగానే ఆమె స్నేహితుడు ఫెరోజ్‌ఖాన్ కలిశాడు. వారిద్దరూ వస్తుండగా స్కూటీని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అజీమాబేగం తీవ్రంగా గాయపడింది. ఆమెను శ్రీకర్ ఆసుపత్రికి తరలించగా రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె సోదరుడు పత్తేమహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపం చెంది..

జిన్నారం(పటాన్‌చెరు): కూరగాయలు తెచ్చేవిషయంలో భార్యతో గొడవ జరిగి మనస్తాపం చెంది అతిగా మద్యం తాగి ఉరివేసుకుని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన జిన్నారం మండలంలోని బొల్లారం పీఎస్ పరిధిలో శనివారం జరిగింది. ఎస్ఐ దశరథ్ కథనం ప్రకారం వర్గల్ మండలం మజీద్‌పల్లి గ్రామానికి చెందిన కోడిపట్ల మహేష్(40), భార్య సరిత పిల్లలతో బొల్లారం మున్సిపల్ పరిధిలోని గాంధీ నగర్‌లో నివసిస్తున్నాడు. మహేష్ వంటపని చేస్తుంటాడు. శుక్రవారం ఉదయం కూరగాయలు తెచ్చేవిషయలో మహేష్‌కు భార్యతో గొడవ జరిగింది. మనస్తాపం చెంది శనివారం అతిగా మద్యంతాగి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడు. మహేష్ భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోనిదర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

4 రోజుల క్రితం అదృశ్యమై..



నర్సింలు (ఫైల్)

వర్గల్(గజ్వేల్): నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి మృతదేహం వర్గల్ మండలం తున్కిఖాల్సా సమీప చెరువులో కనిపించింది. గౌరారం ఎస్ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం ములుగు మండలం నర్సాపూర్‌కు చెందిన పొడిపల్లి నర్సింలు(47) కొంత కాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. దీంతో గత నెల 4న బుధవారం భార్య అతనిడి మందలించింది. అదేరోజు అతను మనవరాళ్లను చూసొస్తానని తున్కిఖాల్సాలో కూతురు ఇంటికెళ్లాడు. పిల్లలను పలకరించి అదేరోజు తిరుగు ప్రయాణమైన నర్సింలు ఆ తరువాత ఆచూకీ లేకుండాపోయాడు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఫలితం దక్కలేదు. మంగళవారం వారు గౌరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే బుధవారం తున్కిఖాల్సా చెరువులో నర్సింలి మృతదేహం లభ్యమైంది. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన దర్శనం రామదాసు (65) చికిత్స పొందుతూ హైద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 3న రామదాసు బెజ్జంకి క్రాసింగ్ రాజీవ్ రహదారిపై నుంచి ద్విచక్ర వాహనంపై గాగిల్లాపూర్ వెళుతుండగా కరీంనగర్ వైపు నుంచి వస్తున్న అబ్దుల్ పాషా తన వాహనంతో ఢీకొనడంతో రామదాసుకు తీవ్రంగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి సోదరుడు చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో..

హవేళిఘణాపూర్(మెదక్): తాగుడుకు బానిసైన ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నంచేసి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామంలో శనివారం వెలుగుచూసింది. పాపన్నపేటకు చెందిన సీతానగరం అశోక్(32) బూర్గుపల్లికి చెందిన యశోదతో వివాహం జరిగింది. తాగుడుకు బానిసై తరుచూ గొడవలు పడేవాడు. ఈ క్రమంలో గత 23న ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరివేసుకున్నాడు. అది గమనించిన భార్య యశోద వెంటనే మెదక్ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. దీంతో గాంధీలో ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

అత్తింటి వేధింపులు భరించలేక..



పద్మ (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): అత్తింటి వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన చిన్నకోడూరులో శనివారం వెలుగు చూసింది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన పల్లె పద్మ(36)కు 15 ఏళ్ల క్రితం చిన్నకోడూరుకు చెందిన పల్లె నర్సింలుతో వివాహం జరిగింది. కొన్నాళ్లుగా భర్త నర్సింలు, అత్త గంగవ్వ, మరిది సతీష్‌లు పద్మను వేధింపులకు గురిచేస్తున్నారు. మనస్తాపం చెందిన పద్మ శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో శనివారం కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సుభాష్ గౌడ్ అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆమె సోదరుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భూముల సమస్యలను పరిష్కరించండి

- బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేందర్‌నాయక్

చిన్నశంకరంపేట(మెదక్): ధరణిలో పార్ట్(బి)లో చేర్చిన రైతుల పట్టాభూముల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేందర్‌నాయక్ డిమాండ్ చేశారు. చిన్నశంకరంపేటలో శనివారం ఆయన మాట్లాడుతూ టి.మాందాపూర్, గజగట్లపల్లి, ఎస్.కొండాపూర్ గ్రామాలల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

కుటుంబ పాలనకు చరమగీతం

- బీజేపీ నేత ఈశ్వర్ సింగ్ ఠాకూర్



మాట్లాడుతున్న ఈశ్వర్ సింగ్ ఠాకూర్

మెదక్: రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలన సాగిస్తున్నారనిఆయన కల్వకుంట్ల ఫ్యామిలీ అభివృద్ధికి కృషి చేస్తే ప్రధాని మోదీ దేశంలోని 140 కోట్ల ప్రజల అభివృద్ధి కోసం పని చేస్తున్నారని కర్ణాటకకు చెందిన ఈశ్వర్ సింగ్ ఠాకూర్ అన్నారు. ఆ పార్టీ మెదక్ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో తొమ్మిదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి ఇచ్చిన నిధులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చూపించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాలలో తమ అభ్యర్థులను గెలిపించడానికి కార్యకర్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు మల్లారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపి, మురళీయాదవ్, నందు జనార్ధన్ రెడ్డి, తాళ్లపల్లి రాజశేఖర్, బాలయ్య, పంజా విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అలిగి వెళ్లిన డీసీఎంఎస్ చైర్మన్

- ఇంటికెళ్లి బుజ్జగించిన మంత్రి హరీశ్‌రావు
- గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక వివాదమే కారణం

జహీరాబాద్/ఝరాసంగం : ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు ఝరాసంగం మండలం బర్దీపూర్ గ్రామ శివారులో శనివారం హెలికాప్టర్ దిగిన వెంటనే ఓ ప్రజాప్రతినిధికి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. మంత్రి సమక్షంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక జాబితాలో పేర్లు తారుమారు కావడమే అందుకు కారణమైందని తెలుస్తోంది. దీంతో అలిగిన శివకుమార్ హెలిపాడ్ వద్ద నుంచి జహీరాబాద్‌లోని తన ఇంటికి వెళ్లిపోయారు. ఝరాసంగం మండలంలో కార్యక్రమాలను ముగించుకున్న అనంతరం మంత్రి జహీరాబాద్ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళుతూ మార్గమధ్యంలో ఉన్న డీసీఎంఎస్ చైర్మన్ ఇంటికి వెళ్లి బుజ్జగించి సమావేశానికి తీసుకువచ్చారు. దీంతో అంతా సర్దుకుంది.

దాతలను ప్రోత్సహించాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

శివంపేట (నర్సాపూర్): గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న దాతలను ప్రోత్సహించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండల పరిధి శభాష్‌పల్లి గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్న భాగ్యనగర్ కాపర్ పరిశ్రమ యజమాని రాకేష్ అగర్వాల్‌ను కలెక్టర్ అభినందించారు. శనివారం ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, సర్పంచ్ పార్వతీ సత్యంతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను రాకేష్ కలిశారు. కార్యక్రమంలో రవి నాయక్, సూపర్‌వైజర్ వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.